సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 14 : కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో టాటా కంపెనీ ప్రతినిధుల సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు నక్క మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల నిరుద్యోగ యువతీయువకులు, స్వీరోస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ అభిమానులు ఈ సమావేశానికి హాజరై, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఎస్పీ, కందికంటి విజయ్‌కుమార్ సిఫారసుతో టాటా కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు విశ్రాంత ఉద్యోగుల భవనంలో సమావేశం ఉంటుందని తెలిపారు. టాటా కంపెనీలో ఉద్యోగ అవకాశాలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరవుతారని తెలిపారు.

ఎగ్జిబిషన్ ఏర్పాటు అడ్డగింత

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 14 : కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం క్రీడా మైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటును శనివారం పట్టణ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సీపీఎం పార్టీ నాయకులు, యువకులు అడ్డుకున్నారు. క్రీడా మైదానంలో ఎగ్జిబిషన్ సామగ్రి తీసుకురావడంతో వారంతా రోడ్డుపై నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శంకరయ్య సంఘటనా స్థలానికి చేరుకొని వారిని సముదాయించారు. నిరసనకారులు మాట్లాడుతూ.. ఎస్పీఎం క్రీడామైదానంలో దసరా, బతుకమ్మ వేడుకలు నిర్వహించకుండా మిల్లు యాజమాన్యం కుట్రపన్నుతుందని ఆరోపించారు. అలాగే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం యువకులు, వృద్ధులు వాకింగ్ చేసేందుకు, క్రీడాకారులకు ఆటలకు ఆటంకం కలుగుతుందన్నారు. పట్టణ సీఐ మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ ఏర్పాటుకు అన్ని విధాలా అనుమతులు అవసరమని, అనుమతులు లేవని, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయారని స్పష్టం చేయడంతో నిరసన విరమించారు.

గురుకులంలో గ్రంథాలయం

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 14 : లక్షెట్టిపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో శనివారం పేరెంట్స్ సహకారంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాకళ్యాణి మాట్లాడుతూ.. రెండోశనివారం పిల్లలను పేరెంట్స్ కలిసే అవకాశం ఉండడంతో పేరెంట్స్ కమిటీ సభ్యులు సంచార గ్రంథాలయ రథాన్ని పాఠశాలకు తీసుకువచ్చినట్లు తెలిపారు. సభ్యులతో పాటు పేరెంట్స్ కొన్ని పుస్తకాలను కొనుగోలు చేసి, పాఠశాలలో గ్రంథాలయం నిర్వహించేందుకు ప్రోత్సాహం అందించారన్నారు. లైబ్రరీకి బుక్స్ అందించేందుకు తోడ్పాటు అందించిన పేరెంట్స్ విజయ్, సరిత దంపతులను ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రావు, సిబ్బంది అభినందించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, మాణిక్యం, మురళి, వీరస్వామి, సుజాత, పేరెంట్స్, స్టూడెంట్స్, స్టాఫ్ పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

- 'నమస్తే' కథనానికి స్పందన

నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

భీమారం, సెప్టెంబర్ 14 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మంచినీటి సౌకర్యార్థం బోర్లను అధికారులు బాగుచేయించారు. 'నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు' అని 'నమస్తే'లో వచ్చిన కథనానికి పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి స్పందించారు. బోరు స్టాటర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో మహిళలు ఆనందంగా నీళ్లు పట్టుకున్నారు.

వీడ్కోలు సమావేశం

బెజ్జూర్, సెప్టెంబర్ 14 : మండలంలో వ్యవసాయ అధికారి రాజులనాయుడు, ఊట్సారంగపల్లి ఏఈవో రవితేజ బదిలీపై వెళ్తుండగా, మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం మండల ఫర్టిలైజర్ సంఘం ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఫర్టిలైజర్ సంఘం అధ్యక్షుడు నేరెళ్ల సందీప్ మాట్లాడారు. మండలంలో రాజులనాయుడు 12 ఏళ్లుగా రైతులు, ప్రజాప్రతినిధులు, తోటి అధికారులతో కలిసి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను విడమరిచి, రైతులకు తెలియజేశామని పేర్కొన్నారు. ఏఈవో రవితేజ అందించిన సేవలు అమోఘమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తుకారాం, నాయకులు జావీద్ అలీఖాన్, కొడప విశ్వేశ్వర్, జాడి డిగంబర్, వసీఖాన్, పర్వీన్ బేగం, పెద్దల సుగుణ, ఫర్టిలైజర్ సంఘం నాయకులు తదితరులున్నారు.

కాజ్‌వేపై కూరుకుపోయిన వాహనం

కాజ్‌వేపై కూరుకుపోయిన వాహనాన్ని బయటకు తీస్తున్న ప్రయాణికులు

చెన్నూర్ రూరల్, సెప్టెంబర్ 14 : మండలంలోని అక్కెపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని వాగుపై కాజ్‌వే పూర్తిగా కుంగిపోతున్నది. ఇప్పటికే ఓ పక్క కూలిపోయింది. మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. శనివారం అక్కెపల్లి నుంచి చెన్నూర్‌కు ప్రయాణికులతో వస్తున్న టాటా ఏస్ వాహనం కాజ్‌వే మధ్యలో ఉన్న గుంతలో కూరుకుపోయింది. వెంటనే ప్రయాణికులు అందులో నుంచి దిగి గ్రామస్తుల సహకారంతో గంటపాటు శ్రమించి బయటకు తీశారు. వాగు ప్రవాహం ఉన్న సమయంలో ఇలా జరిగితే ప్రమాదాలు సంభవిస్తాయని ప్రయాణికులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి, వాగుపై వంతెనపై నిర్మించాలని కోరుతున్నారు.

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

తాండూర్, సెప్టెంబర్ 14 : పోలీసులు ప్రజల రక్షణ, భద్రత కోసం పని చేస్తున్నారని, పోలీసులంటే భయాన్ని వీడాలని తాండూర్ ఎస్ఐ డీ కిరణ్ కుమార్ అన్నారు. తాండూరు సీఐ కుమారస్వామి పర్యవేక్షణలో తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొత్తపల్లిలో 'పోలీస్ నైట్ హాల్ట్' నిర్వహించారు. మూఢనమ్మకాల నిర్మూలన, అడవుల సంరక్షణ, సైబర్ క్రైం, కలప స్మగ్లింగ్, సీసీ కెమెరాల పని తీరు, ట్రాఫిక్ నింబంధనలు, నాటుసారా పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు షీ టీంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా మెలగాలని, ఘర్షణలకు పాల్పడకుండా స్నేహభావంతో ఉండాలని సూచించారు. సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

ఇద్దరి కిడ్నాప్.. కేసు నమోదు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 14 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో పందిరి లింగయ్య, గుమ్ముల సంతోష్ కిడ్నాప్‌కు గురైనట్లు ఎస్ఐ సతీశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో శనివారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అదే గ్రామానికి చెందిన శాఖపురం శంకరయ్య.. తాను ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో శుక్రవారం రాత్రి లింగయ్య, సంతోష్‌ను బైక్‌పై లక్ష్మీపూర్ స్టేజీవైపు తీసుకెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో లింగయ్య భార్య సరోజన స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శాఖపురం శంకరయ్యపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీని రద్దు చేయాలి

మంచిర్యాల (ఏసీసీ), సెప్టెంబర్ 14 : ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి కమిటీని రద్దు చేయాలని కోరుతూ మాల మహానాడు ఆఫ్ ఇండియా ప్రతినిధులు కాంగ్రెస్ అసంఘటిత ఉద్యోగ జాతీయ చైర్మన్ ఉదిత్‌రాజ్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును, అలాగే దీనిపై ఏర్పాటు చేసిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి కమిటీని కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ రాష్ట్రంలో లేని విధంగా కమిటీ నిర్ణయం తీసుకోవడం పద్ధతి కాదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మగ్గిడి దీపక్, అరె దేవకర్ణ, గంట బబిత పాల్గొన్నారు.

అవగాహన లోపం.. ప్రయాణికులకు శాపం

- ఎన్‌హెచ్ఏఐ అధికారుల నిర్వాకం..
- బస్‌షెల్టర్ ఒకచోట.. బస్సు ఆగేది మరోచోట
- మందమర్రి పట్టణంలో ప్రజలు, విద్యార్థుల అవస్థలు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మించిన బస్ షెల్టర్

పాతబస్టాండ్ మూలమలుపు వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మందమర్రి, సెప్టెంబర్ 14 : జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారుల అవగాహనా లోపం మందమర్రి పట్టణ ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులకు శాపంగా మారింది. నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో ఆయా ప్రాంతాల్లోని బస్‌షెల్టర్ల నిర్మాణంలో వారి అనాలోచిత విధానం ఆయోమయానికి గురిచేస్తున్నది. స్థానిక పాతబస్టాండ్, యాపల్ ఏరియాలో బస్‌షెల్టర్లతో తిప్పలు తప్పడం లేదు. మందమర్రి మున్సిపాలిటీ పరిధి ప్రాణహిత కాలనీ, 1, 2, 3, కార్మిక కాలనీలతో పాటు, మార్కెట్ ఏరియా, పాతబస్టాండ్, రామన్ కాలనీ, యాపల్ ఏరియాలకు చెందిన వందలాది మంది నిత్యం ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మార్కెట్ ఏరియా ప్రజలు పాతబస్టాండ్‌కు వచ్చి, బస్సుల ద్వారా ప్రయాణాలు చేస్తుంటారు. అలాగే యాపల్ ఏరియా ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సింగరేణి జీఎం కార్యాలయ మూలమలుపు వద్ద బస్సుల ద్వారా వెళ్లివస్తుంటారు. విద్యార్థులు ఆయా బస్టాప్‌ల వద్ద బస్సులు ఎక్కి పాఠశాలలు, కళాశాలలకు వెళ్తుంటారు. అయితే నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో ఆయా ప్రాంతాల్లోని బస్‌షెల్టర్లను ఎన్‌హెచ్ఏఐ అధికారులు తొలగించారు. అప్పటి నుంచి ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులకు కష్టాలు మొదలయ్యాయి. రహదారి పూర్తయిన తర్వాత అధికారులు బస్సులు నిలిపేచోట బస్‌షెల్టర్లను నిర్మించకుండా దూర ప్రాంతంలో నిర్మించారు. పాతబస్టాండ్ మూలమలుపు వద్ద బస్సులను నిలుపుతుండగా, అక్కడికి కొంత దూరంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బస్‌షెల్టర్‌ను నిర్మించారు. యాపల్ ఏరియాలో సింగరేణి సివిల్ కార్యాలయం, బెల్లంపల్లి వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రభుత్వ దవాఖాన వద్ద బస్‌షెల్టర్లను నిర్మించారు. బస్సులు నిలిపే చోట కాకుండా దూర ప్రాంతంలో నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులు ఎండ, వానకు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ప్రయాణికులకు ఉపయోగపడేలా బస్ షెల్టర్లను నిర్మించాలని కోరుతూ స్థానిక బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు వినతిపత్రాలను సమర్పించారు. సమస్యను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు సర్వత్రా ఉన్నాయి. అధికారుల అవగాహనా లోపం మూలంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని బస్సులు నిలిపే చోట బస్‌షెల్టర్లను నిర్మించాలని ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

హౌసింగ్ సొసైటీపై నిరాధార ఆరోపణలు

- టీఎన్జీవో అధ్యక్షుడు శ్రీహరి

హాజీపూర్, సెప్టెంబర్ 14 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం హౌసింగ్ సొసైటీపై కొందరు సంఘ సభ్యులు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వాటిని సహించేది లేదని ఆ సొసైటీ అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. ఆ సంఘ కార్యాలయంలో శనివారం సొసైటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో సుమారు 45 ప్లాట్లు రోడ్డు కిందపోయాయని, ఇందులో ఇప్పటి వరకు 30 మంది సభ్యులకు ప్లాట్లను సర్దుబాటు చేసినట్లు చెప్పారు. మిగతా 15 మందికి త్వరలోనే సర్దుబాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 110 మంది సభ్యుల ప్లాట్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ ఉన్నవారికి అందరి సమక్షంలో లక్కీ డ్రా తీసి కేటాయించినట్లు చెపారు. ఇందులో అవకతవకలు జరుగలేదని స్పష్టం చేశారు. సభ్యులు కట్టిన రూ.లక్షతో ల్యాండ్ డెవలప్‌మెంట్‌తో పాటు, ఎలక్ట్రిసిటీ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. గతంలో ప్లాట్ నంబర్ 231 కుర్షీద్‌కు కేటాయించడం జరిగిందని, ఆ ప్లాటు ప్రస్తుతం ఎగ్జిబిషన్ పెట్టిన స్థలంలో ఉందన్నారు. సొసైటీ స్థలం 5.20 ఎకరాలు కోర్టు కేసులో ఉందని, కేసు పూర్తయిన తర్వాత గతంలో కేటాయించిన వారందరికీ ప్లాట్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్లాట్ నంబర్ 231 కూడా కేసు స్థలంలోనే ఉన్నదని, సభ్యులు కలిసి కట్టుగా సమస్యలను పరిష్కరించుకునేలా వ్యవహరించాలని కోరారు. కానీ, హౌసింగ్ సోసైటీపై కొందరు సభ్యులు నిరాధారణ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అనంతరం హౌజింగ్ సోసైటీ ఉపాధ్యక్షుడు సైండ్ల మెండయ్య, సభ్యుడు దేవరాజేశ్వర్ మాట్లాడుతూ.. రూ.5 లక్షలు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వసూలు చేస్తున్నారని కొందరు ఆరోపణలు చేశారని, ఆ విషయంలోవారికి ఏ సంబంధమూ లేదని తేల్చిచెప్పారు. కార్యదర్శి హబీబ్ హుస్సేన్, కోశాధికారి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, సభ్యులు ఎస్‌కే మహ్మద్, మురళీధర్, లక్ష్మణ్, ప్రకాశ్ రావ్, కిరణ్ కుమార్, రమేశ్, డీ రాజేశ్వర్, రాజమౌళి, సంపత్‌కుమార్, ఆండాలు, జాన్ డేవిడ్, హేమలత, స్వరూప, నందయ్య, తిరుపతి రెడ్డి, జయ లక్ష్మణ్ రావ్, చంద్రశేఖర్ రెడ్డి, రామానందం, రాజారెడ్డి, లక్ష్మీనారాయణ, శంకరయ్య, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సంఘటితం చేయడమే లక్ష్యం

మందమర్రి, సెప్టెంబర్ 14 : మందమర్రి పట్టణంలోని బీసీ కుల సంఘాలన్నింటినీ సంఘటితం చేయడమే తమ లక్ష్యమని బీసీ కులాల నాయకులు అన్నారు. స్థానిక శ్రీకృష్ణ గార్డెన్‌లో శనివారం వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. రానున్న రోజుల్లో అన్ని బీసీ కుల సంఘాలను సంఘటితం చేయాలని తీర్మానించారు. మరికొద్ది రోజుల్లో నిర్వహించనున్న సమావేశానికి అన్ని బీసీ కుల సంఘాల సభ్యులు హాజరవ్వాలని సూచించారు. ఐక్య కుల సంఘాల నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. ఐక్య కార్యాచరణలో పాలుపంచుకునే బీసీ కుల సంఘాల నాయకులు, సభ్యులు 99481 82143, 81253 33576 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల నాయకులు మిట్ట లక్ష్మణ్, పార్వతి రాజిరెడ్డి, గాసుల సుదర్శన్, మాయ రమేశ్, కుదిరె అంజయ్య, సమ్మయ్య, మద్ది వేణుగోపాల్, కొత్తపల్లి సత్యనారాయణ, మాయ శ్రీనివాస్, కట్ల మోహన్, సూరంపల్లి శ్రీనివాస్, అడిగొప్పుల మురళి, తౌటం శ్రీనివాస్, బుర్ర వెంకటేశ్, మురహరి రవి, రాంచందర్, పరశురాం, సాయి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ట్రాక్టర్ల పేరిట మోసం.. ముగ్గురి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 14 : రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు ఇప్పిస్తామని మోసం చేసిన కేసులో బెల్లంపల్లికి చెందిన కామెర చంద్రమౌళి, రత్నం శ్రీకాంత్, గోలిం కార్తిక్‌ను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్ తెలిపారు. శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. గోలిం కార్తిక్.. తాను మార్కెటింగ్ మేనేజర్‌ను అని చెప్పి భారత్ కిసాన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ద్వారా ఎస్ఏపీఎస్ కంపెనీ నుంచి లోన్లు ఇస్తున్నామని హాజీపూర్ మండలం కర్ణమామిడికి చెందిన బొడ్డు శేఖర్‌ను నమ్మించాడు. రూ.6.40 లక్షల ట్రాక్టర్ తీసుకుంటే 50 శాతం సీఎస్ఆర్ ఫండ్స్ కింద సబ్సిడీ వస్తుందని చెప్పి, రూ.3.20 లక్షలు, కమీషన్ కింద రూ.35 వేలు తీసుకున్నాడు. స్వరాజ్ ట్రాక్టర్ షోరూంలో రూ.1.07 లక్షలు డౌన్ పేమెంట్ చేయించాడు. అనంతరం పలు డాక్యుమెంట్ల పై సంతకాలు తీసుకున్నాడు. అనంతరం మహేంద్ర ఫైనాన్స్‌లో రూ.5.33 లక్షల లోన్ తీసుకున్నట్లు బాధితుడికి తెలిసింది. మోసపోయినట్లు గ్రహించి మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తును ప్రారంభించగా, శనివారం జన్మభూమినగర్‌లో ఉన్నవారి కార్యాలయంలో చంద్రమౌళి, శ్రీకాంత్, కార్తిక్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారించగా, హైదరాబాద్‌లో మెయిన్ బ్రాంచ్ ఉందని నమ్మించి దాదాపు 88 మంది రైతుల నుంచి రూ. 2.76 కోట్లు తీసుకున్నట్లు, డబ్బు రొటేట్ చేస్తే అందులో నుంచి 82 మందికి ట్రాక్టర్లను అందించినట్లు, మిగతా ఆరుగురికి ట్రాక్టర్లు ఇవ్వలేదని ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. రూ.40 లక్షలు జల్సాలకు వాడుకున్నట్లు చెప్పారు. వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు.

క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

చెన్నూర్, సెప్టెంబర్ 14 : లక్షెట్టిపేటలో జరిగిన సౌత్‌జోన్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల (బాలుర) పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-18 విభాగంలో 100 మీటర్ల పరుగుపందెంలో టీ ప్రశాంత్ (ప్రథమ), లాంగ్ జంప్‌లో ఆర్ శ్రావణ్‌కుమార్ (ప్రథమ), హైజంప్‌లో (ద్వితీయ), డిస్కస్‌త్రో, జావలిన్ త్రోలో కే అజయ్ (ద్వితీయ) స్థానంలో నిలిచారని వివరించారు. అండర్-14 విభాగం 600 మీటర్లు, 60 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో టీ రిషిత్ (ప్రథమ), 60మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, బ్యాక్‌త్రోలో కే మనికంత (ద్వితీయ), 600 మీటర్ల పరుగు పందెంలో ఎం అజయ్ (ద్వితీయ) స్థానంలో నిలిచారని వివరించారు. ఈ నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్, పీఈటీ విజయ్, ఏటీపీ శ్రీకాంత్, డిప్యూటీ వార్డెన్ సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 14 : పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలకు చెందిన 12 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ శ నివారం తెలిపాడు. ఈ నెల 13న పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. 18, 19వ తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి కీడల్లో పాల్గొంటారని తెలిపారు. వారిని ప్రిన్సిపాల్‌తో పాటు, పీడీ నాంపల్లి, పీఈటీ ఆజేశ్, ఏటీపీ సాగర్, సిబ్బంది అభినందించారు. అండర్ 20 విభాగంలో 800జీటర్లరుగులో కే హరిప్రసాద్ (ప్రథమ), 100 మీటర్ల పరుగులో పీ వెంకటేశ్ (ప్రథమ), 3000 మీటర్ల పరుగులో ఆర్ అరున్‌కుమార్ (ద్వితీయ), షాట్‌పుట్‌లోఓ కే అఖిల్ (తృతీయ) విజేతలుగా నిలిచారని తెలిపారు. అండర్-18 విభాగంలో డిస్క్, జావెలిన్ త్రోలో బీ రాకేశ్ (ప్రథమ), షాట్‌పుట్‌లో ఎన్ శ్యామ్ (ప్రథమ), వెయ్యి మీటర్ల పరుగులో బీ శివకుమార్ (ద్వితీయ), లాంగ్‌జంప్‌లో బీ విష్ణు (ద్వితీయ), వంద మీటర్ల పరుగులో డీ ప్రణయ్ (తృతీయ).., అండర్-16 విభాగం షాట్‌పుట్‌లో యూ ప్రేమ్‌కుమార్ (తృతీయ), 60 మీటర్ల పరుగులో సాయి అనుప్ (ప్రథమ), లాంగ్‌జంప్‌లో అన్వన్న (ద్వితీయ) విజేతలుగా నిలిచినట్లు వెల్లడించారు.

అవార్డు అనందంగా ఉంది

అవార్డు అందుకుంటున్న సీనియర్ కరస్పాండెంట్ ఇప్ప పోచయ్య

రెబ్బెన, సెప్టెంబర్ 14 : 2024-25 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం సీనియర్ కరస్పాండెంట్ ఇప్ప పోచయ్య పేర్కొన్నారు. 25 ఏళ్ల నుంచి ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దినందుకు గాను ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ట్రస్మా రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ శేఖర్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

చెరువుల కబ్జా ఆపాలి

లక్షెట్టిపేట,సెప్టెంబర్ 14 : మండలంలోని చెరువులు, కుంటల కబ్జాను ఆపాలని డిమాండ్ చేస్తూ లక్షెట్టిపేట తహసీల్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఫెక్సీతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రభంజనం మాట్లాడుతూ.. చెరువులు, కుంటల భూమి విస్తీర్ణం గుర్తించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని డిమాండ్ చేశారు. పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఆకాశ్ మండల్, అరుణ్, రవీందర్, యోగేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సందీప్(ఫైల్)

భీమారం, సెప్టెంబర్ 14 : మండలంలోని పోలంపల్లి గ్రామానికి చెందిన నర్మెట సందీప్ (22) గత నెల 19న పురుగుల మందు తాగగా, హనుమకొండలోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతు శనివారం మృతిచెందినట్లు భీమారం హెడ్‌కానిస్టేబుల్ మాచర్ల తెలిపారు. తల్లి ఆరోగ్యం బాగోలేదని రాఖీ పండుగ రోజున మద్యం తాగాడు. అదే మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేటు దవాఖానలో చేర్పించారు. కాగా, పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వినాయక మండపం వద్ద రక్తదానం

మందమర్రి రూరల్, సెప్టెంబర్ 14 : మందమర్రి మండలం ఆదిలపేట్ గ్రామంలో హనుమాన్ దేవాలయం వద్ద శనివారం హనుమాన్ గణేశ్ మండలి సభ్యుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వినాయక మండలి సభ్యులు కోట్రంగి రామ్‌చందర్, అదే ధర్మయ్య, కోట్రంగి శ్రీనివాస్, యూత్ సభ్యులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సుజాత, శ్రీనివాస్, హరీశ్ పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన ఐకే1ఏ కార్మికుడు

జైపూర్, సెప్టెంబర్ 14 : శ్రీరాంపూర్ ఏరియా ఇందారంఖని 1ఏ గనికి చెందిన జనరల్ మజ్దూర్ రాము శనివారం పాముకాటుకు గురయ్యాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందారం గోదావరి వద్ద ఏర్పాటు చేసిన షెల్టర్‌లో రివర్‌గార్డుగా మొదటి షిఫ్టు విధులు నిర్వహిస్తుండగా, పాముకాటువేసింది. అధికారులు సింగరేణి ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు.

దాడి కేసులో భార్యాభర్తల రిమాండ్

చింతలమానేపల్లి, సెప్టెంబర్ 14 : చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి రవీంద్రనగర్-2లో ఈ నెల 11 బుధవారం రాత్రి కృష్ణ మండల్‌పై ఆయన తమ్ముడు పవిత్ర మండల్ కత్తితో దాడి చేయగా, తీవ్ర గాయాలయ్యాయి. ఈ కేసులో బాధితుడి భార్య హీరా మండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పవిత్ర మండల్, భార్య ఉమ మండల్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేశ్ తెలిపారు.

మల్కేపల్లి